


విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

- రైతులకు మోటార్ కనెక్షన్లు మంజూరు చేస్తాం
- పంట పొలాల్లో వేలాడుతున్న తీగలను తొలగిస్తాం
- శిథిలావస్థలో ఉన్న స్తంభాలను మారుస్తాం
- అర్హులకు 'గృహజ్యోతి' అందేలా చర్యలు తీసుకుంటాం
- టీజీఎస్ ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



విద్యుత్ వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ఖమ్మంలోని ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో శనివారం నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. జిల్లాలో గృహ, వాణిజ్య విద్యుత్ వినియోగదారులతో పాటు రైతులు, గృహజ్యోతి లబ్ధిదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఫోన్ ద్వారా నేరుగా ఎస్ఈకి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 'హలో... ఎస్ఈ' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సాగునీటి ఎత్తిపోతల పథకాలు, విద్యుత్ సమస్యల నుంచి గృహజ్యోతి సమస్యల వరకు వినియోగదారులు చెప్పిన సమస్యలను ఎస్ఈ సురేందర్ తన అధికారుల బృందంతో ఓపికగా వినడమే కాకుండా, రాతపూర్వకంగా నోట్ చేసుకున్నారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత మండల ఏఈలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈలు నంబూరి రామారావు, వి.బాబురావు, ఏడీఈలు ఖాదర్‌బాబు, జి.శ్రీధర్ పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్. పాల్గొన్న ఎన్పీడీసీఎల్ అధికారులు

ప్రజల ప్రశ్నలు.. ఎస్ఈ సమాధానాలు... 6

ప్రత్యేక 'సదరం'

క్యాంపులు

- రేపటి నుంచి జనవరి 17 వరకు నిర్వహణ
- వేదిక.. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23 నుంచి జనవరి 17 వరకు దివ్యాంగులకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక 'సదరం' క్యాంపులు నిర్వహించనున్నట్టు ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. సదరం వైకల్యం అంచనా ధ్రువీకరణ పత్రం కోసం మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోను మీసేవ కేంద్రానికి తీసుకెళ్లాలి. స్లాట్ బుకింగ్ ప్రకారం దరఖాస్తుదారుడు మీసేవ రశీదుతో పాటు మెడికల్ క్యాంపునకు హాజరవ్వాల్సి ఉంటుంది. వైద్యులు క్యాంపుల్లో పార్ట్-ఎ వివరాలను ఆమోదించి సదరం గుర్తింపు సంఖ్య నమోదు చేయనున్నట్టు తెలిపారు.

తేదీలు ఇవీ...

ఈనెల 23న వైరా నియోజకవర్గంలోని ఏన్కూరు, కొణిజర్ల, సింగరేణి, వైరా మండలాల వారికి, డిసెంబరు 27న సత్తుపల్లి నియోజకవర్గం పరిధిలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూరు, సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో వారు హాజరుకావాల్సి ఉంటుంది. జనవరి 2న మధిర నియోజకవర్గం పరిధిలోని బోనకల్, చింతకాని, మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, మధిర మునిసిపాలిటీలకు చెందిన వారికి, జనవరి 9న ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం, ఖమ్మం మునిసిపాలిటీ, కామేపల్లి మండలాలకు చెందిన వారికి, జనవరి 17న పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన వారికి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపులను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగించుకోవాలని డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ కోరారు.

'బైక్ అంటే ఒకప్పుడు సౌకర్యం.. కానీ నేడు బైక్ ఒక అవసరం'గా మారిపోయింది. ప్రస్తుతం బైక్ లేని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా బైక్‌ల వినియోగం భారీగా పెరిగిపోయింది. దాంతో పెట్రోల్ ధరలు ఆకాశాన్నంటాయి. ఈ నేపథ్యంలో ఇంధన ఖర్చును తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయంగా వచ్చినవే 'ఈ-బైక్స్'. బ్యాటరీ ఆధారంగా నడిచే ఈ ఎలక్ట్రిక్ బైక్స్ ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమయ్యేవి. కానీ మారుతున్న ప్రజల ఆలోచనా సరళి, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో నేడు పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జనం ఈ-బైక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.

- ప్రకృతిహితం.. ఖర్చు పరిమితం...
- ఎలక్ట్రిక్ బైక్‌లకు పెరుగుతున్న ఆదరణ
- పల్లె, పట్నాల్లో విరివిగా వాడకం
- కలిసొస్తున్న ఉచిత విద్యుత్ పథకం
- అదనపు ఆకర్షణగా మారిన ఫ్రీ రిజిస్ట్రేషన్
- స్త్రీ, పురుషులకు అనువుగా ఉంటున్న బైక్‌లు
- స్థానిక అవసరాలకు ఎంతో ఉపయోగకరం



సండే స్పెషల్
SUNDAY SPECIAL

ఈజీ రైడ్ ఈవీ బైక్

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరలు ప్రజలను ఎలక్ట్రిక్ బైక్‌ల వైపు మళ్లిస్తున్నాయి. ఒకప్పుడు ఈ-బైక్‌ల జోరు పట్టణాలకే పరిమితమయ్యేది. కానీ మారుతున్న కాలాను గుణంగా పల్లెల్లోనూ 'ఈవీ'లపై మక్కువ పెరుగుతోంది. ప్రభుత్వ ప్రోత్సాహం, తక్కువ నిర్వహణ ఖర్చు వంటి కారణాలతో పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అనేకమంది విద్యుత్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'గృహజ్యోతి' ద్వారా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండడంతో పల్లెల్లోనూ ఈ వాహనాల కొనుగోలు పెరిగింది. ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహన రిజిస్ట్రేషన్ ఫీజులను రద్దు చేయటం కూడా ప్రజలు ఈ వాహనాల వైపు మొగ్గు చూపడానికి ఓ కారణంగా నిలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో వేలల్లో వాహనాలు

ఒకప్పుడు జిల్లా కేంద్రాలు, పెద్దపెద్ద పట్టణాల్లో మాత్రమే ఈవీ బైక్‌ల షోరూంలు ఉండేవి. దీనికి తోడు వాహనాల్లో బ్యాటరీలు పేలిపోతున్నాయనే ప్రచారం జరగడంతో పల్లె ప్రజలు వీటి కొనుగోలుకు ముందుకు వచ్చేవారు కాదు. కానీ నేడు మండల కేంద్రాల్లోనూ షోరూంలు ఏర్పాటు చేసి వాహనాల వినియోగంపై అవగాహన కలిగిస్తుండటంతో విద్యుత్ బైక్‌ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రతి పల్లెల్లోనూ విద్యుత్ బైకులు దర్శనమిస్తున్నాయి. ఒక్కో ఈవీ బైక్ ధర రూ.75వేల నుంచి రూ.1.70 లక్షల వరకు ఉంది. తక్కువ ఖర్చుతో రోజువారీ అవసరాలకు అనువుగా ఉండటంతో జిల్లాలో ఈ వాహనాల కొనుగోలు భారీగా పెరుగుతోంది. పలు కంపెనీలు వ్యాపారులు, రైతుల కోసం ప్రత్యేకంగా వాహనాలను తయారుచేసి మార్కెట్‌లో ఉంచుతున్నారు.

పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు

సాధారణంగా పెట్రోల్, డీజిల్ వాహనాలకు వాటి ధరలను బట్టి 9శాతం నుంచి 20శాతం వరకు జీవితకాల పన్ను చెల్లించాలి. ఇతర ఛార్జీలు అదనంగా ఉంటాయి. అయితే విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ (మిగతా 6వ పేజీలో)

ఉచిత విద్యుత్ ఉపయోగపడుతుంది
పద్మం శ్రీను, నందిపాడు



రూ.లక్షతో ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశా. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 100 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నా. రెండు రోజులకొకసారి ఛార్జింగ్ పెడుతున్నా.. ఉచిత విద్యుత్ పథకంతో కరెంటు ఖర్చు కూడా లేదు. పైసా ఖర్చు లేకుండా నిత్యం ప్రయాణం చేస్తున్నా. పెట్రోల్ ఖర్చుకు మిగిలిన డబ్బుతో నెల రూ.4వేలు బైక్ కిస్తీ కడుతున్నా.

4గంటల చార్జింగ్‌తో120 కి.మీ.
పైడి శ్రీనివాస్, మారుతినగర్



నాలుగు గంటలు ఛార్జింగ్ పెడితే 120 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నా.. ఇద్దరు ముగ్గురు వెళ్లినా ఎటువంటి ఇబ్బంది ఉండదు. వారానికి ఒకటి రెండుసార్లు ఛార్జింగ్ పెడితే ఎక్కడికైనా తిరగవచ్చు. ఎలక్ట్రిక్ వాహనంతో ఎంతో ప్రయోజనం ఉంది.



ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి

భూ భారతితో రైతుల భూమికి భద్రత

- అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం
- నెల రోజుల్లో కల్లూరును మునిసిపాలిటీగా ప్రకటిస్తాం : మంత్రి పొంగులేటి

6



మాట్లాడుతున్న వెంకట్

ప్రపంచమంతా కమ్యూనిజం వైపు మళ్లుతోంది..

- వర్గ పోరాటాలను విస్తృతంగా నిర్వహించాలి
- మిలిటెంట్ పోరాటాలకు కేంద్రంగా మారాలి : సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

బందాల దేవరగుట్ట అటవీ ప్రాంతంలో

పెద్దపులి పాద ముద్రలు

7

దిక్కులేని 'ధరణి' ఆపరేటర్లు

- 10 నెలలుగా అందని వేతనాలు
- మొండిచేయి చూపుతున్న ఎన్ఐసి
- కుటుంబ పోషణ భారం అవుతోందని ఆవేదన



సత్తుపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ పేరుతో నియమితులై ధరణి ఆపరేటర్లుగా పని చేస్తున్న వారికి పది నెలలుగా వేతనాలు అందడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన నుంచి వీరు పని చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 650మంది నియమితులు కాగా, వీరికి ధరణి పోర్టల్ నిర్వహించిన ఎసెంట్రిక్ సంస్థ వేతనాలు ఇచ్చింది. సదరు కంపెనీ నుంచే వారికి వేతనాలు అందేవి. వేతనం రూ.19,500గా నిర్ణయించినప్పటికీ, రూ.10,500 మాత్రమే ఇస్తున్నారని కొందరు ఆపరేటర్లు తెలిపారు. ప్రారంభంలో పీఎఫ్ కట్ చేసినా తరువాత కాలంలో చేయలేదని చెపుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ధరణి పోర్టల్ బాధ్యతల నుంచి పాత సంస్థను తొలగించి నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్‌కు అప్పగించారు. ఆగస్టు నుంచి ఎన్ఐసీ ధరణి పోర్టల్ బాధ్యతలు చూస్తోంది. డిసెంబరు నుంచి ఎన్ఐసీకి పూర్తి డేటాను అందజేసారు.

ఉమ్మడి జిల్లాలో 45 మంది..

రాష్ట్ర వ్యాప్తంగా 650మంది ధరణి ఆపరేటర్లు ఉండగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 45 మంది ఉన్నారు. ప్రతి మండల రెవెన్యూ కార్యాలయంతోపాటు ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టరేట్‌లలో కూడా పని చేస్తున్నారు. పాత సంస్థ ఎసెంట్రిక్ ఆపరేటర్లకు ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉంచగా, ఎన్ఐసీ కూడా నాలుగు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉంది. మొత్తంగా 10 నెలలుగా వేతనాలు అందక ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10,500 ఎటూ సరిపోవటం లేదని, అవి కూడా పెండింగ్‌లో పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిభారంతో అంగన్‌వాడీల సతమతం

- సొంత శాఖ సేవలకు న్యాయం చేయని పరిస్థితి
- ఇతర శాఖల సేవలకు పరిమితం
- తాజాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అంగన్‌వాడీలు
- తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న వైనం

7



సర్వే నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం



- టీఎస్ ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్
- 'ఆంధ్రజ్యోతి' 'ఫోన్ ఇన్'కు అనూహ్య స్పందన

విద్యుత్ సంబంధిత సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' శనివారం నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఎ.సురేందర్ వినియోగదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ప్రశ్నలను సావధానంగా విని, వాటిని నోట్ చేసుకొని సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తన అధికారుల బృందంతో ఆయన ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు. జిల్లా నలుమూలల నుంచి అనేకమంది ఫోన్ చేసి తమ సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. ఎంతో ఉపయోగకరమైన కార్యక్రమం చేపట్టినందుకు వారు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

మాది మధిర మండలం ఇల్లెందులపాడు. ఇక్కడ డ్రెయిన్‌లోనే రెండు విద్యుత్ పోల్స్ వేశారు. గట్టిగా వర్షం వస్తే ఇళ్లలోకి వరద వస్తుంది. స్తంభాలు కూడా గట్టిగా లేవు.. ఊగుతున్నాయి. వాటిని డ్రెయిన్‌లోని నుంచి తీసి బయట వేయకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది....

చావా వెంకటేశ్వరరావు, ఇల్లెందులపాడు, మధిర మండలం

ఎస్ఈ: డ్రెయిన్‌లో పోల్స్ వేయడానికి నిబంధనలు ఒప్పుకోవు.. పోల్స్ వేసిన తర్వాత డ్రెయిన్ వేసి ఉండవచ్చు. అయినప్పటికీ మా ఏఈని పంపి దీనిపై నివేదిక తీసుకుని పోల్స్‌పై భాగంలో వేయించేందుకు సత్వరం చర్యలు తీసుకుంటాం.

ఖమ్మం వైరా రోడ్డులోని నిజాంపేట సౌత్ ఇండియా మాల్ సందులో పాత ఇనుప స్తంభానికి ఎక్కువ కనెక్షన్లున్నాయి. స్తంభం పడిపోయేలా ఉంది. సిమెంట్ స్తంభం కూడా పగుళ్లు వచ్చాయి.. కొత్త స్తంభం వేయండి.

కె.హనుమంతరావు/రహీమున్నీసా, నిజాంపేట, ఖమ్మం

ఇనుప స్తంభం వల్ల కరెంట్ షాక్ భయం ఉండదు. ఇనుప స్తంభమే ఎక్కువకాలం ఉంటుంది. కింద తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉంటే తొలగిస్తాం. అలాగే సిమెంట్ స్తంభం పగుళ్లు వచ్చిందని చెబుతున్నారు. ఏఈని పంపించి పరిస్థితి తెలుసుకుని అవసరమైతే మార్పులు చేస్తాం.

మా ముత్తాత కె.నరసయ్య పేరుతో ఇంకా ఇంటి విద్యుత్ కనెక్షన్ నడుస్తుంది. మా తండ్రి రామ్మూర్తి పేరుపై విద్యుత్ కనెక్షన్ మార్పు చేయాలి.

-కె.ప్రమోద్‌కుమార్, జడ్పీసెంటర్, ఖమ్మం

ఎస్ఈ: మీ సేవకు వెళ్లి దరఖాస్తు చేయాలి. మీ ముత్తాతనుంచి మీ నాన్నగారికి సంక్రమించిన వివరాలతోపాటు కార్పొరేషన్‌లో మీ ఇంటి నెంబరు మీ నాన్నగారు పేరుమీద మార్పుచేసి ఉండాలి. మీ సేవలో దరఖాస్తు చేస్తే వెంటనే మీ నాన్న పేరుమీద కనెక్షన్ మారుతుంది.

కరెంట్ తీగలకు అడ్డువచ్చిన చెట్లు, మొక్కలను నరికి రోడ్డుపై పడేస్తున్నారు. వాటిని ఎవరు తీసుకుపోవాలో అర్థంకావడంలేదు. కార్పొరేషన్ సిబ్బంది తీయడంలేదు. అలాగే 50 ఏళ్లనాటి ఇనుపస్తంభం ఇక్కడే ఉంది. అది షాక్ కొడుతోంది

-పసుమర్తి రాంమోహన్, గాంధీచౌక్, ఖమ్మం

ఈ సమస్యను కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి కరెంట్ తీగలకు అడ్డువచ్చిన చెట్ల మండలు తొలిగించినప్పుడు వాటిని తీసుకెళ్లాలని కార్పొరేషన్ అధికారులకు చెబుతాం. అలాగే పాత ఇనుప స్తంభం పాడై షాక్ వస్తుంటే దానిని తొలగిస్తాం.

రూ.13కోట్లతో ఏడేళ్ల క్రితం లిఫ్టుపెట్టారు. కానీ కనెక్షన్ ఇవ్వలేదు. ఇల్లెందులపాడు నుంచి స్తంభాలు వేయాలి. వేయలేదు దీంతో కరెంట్ లేక లిఫ్టు వినియోగం లేకుండా పోయింది.

- మట్టా గోవిందరావు, మహదేవపురం, మధిర మండలం

ఎస్ఈ: దీనిపై ఇప్పటికే లైన్ వేసేందుకు ఎస్టిమేషన్ వేశాం. జనవరి లోగా ఇల్లెందులపాడు నుంచి విద్యుత్ లిఫ్టుకు అందించి లిఫ్టు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఖమ్మం రామచంద్రయ్యనగర్‌లో 120 గుడిసెలున్నాయి. వారికి కరెంట్ స్తంభాలు లేక విద్యుత్ లైన్లు దూరం నుంచి తీసుకుంటున్నారు.. చాలా ఇబ్బంది పడుతున్నారు.

-బిక్కసాని జశ్వంత్, ఖమ్మం

దీనికి రూ.7.89లక్షలతో అంచనా వేయించడం జరిగింది. కార్పొరేషన్ నుంచి లేదా ప్రభుత్వం నుంచి సొమ్ము చెల్లిస్తే తప్పనిసరిగా కరెంట్ పోల్స్ వేస్తాం. అలాగే అక్కడ స్తంభాలు వేస్తే నడిచేందుకు దారి లేదు. ఆ దారి కూడా మీరు చూపించాల్సిన అవసరం ఉంది.

మోటార్ కనెక్షన్ కోసం డీడీ కట్టి ఏడాదైంది. బోరు కూడా వేశా. 19మంది రైతులకుగాను 15 మందికి కనెక్షన్లు ఇచ్చారు. మాకు అడిగితే ఇస్తామని చెబుతున్నారు తప్పా ఇవ్వడంలేదు.

-వేముల వెంకటేశ్వర్లు, తనికెళ్ల, కొణిజర్ల మండలం

డీడీ కట్టిన వివరాలు నాకు వాట్సాప్ ద్వారా తెలపండి. ఏఈని విచారణకు పంపుతాం. గతంలో ఎస్టిమేషన్‌కు అనుగుణంగా డబ్బులు కట్టి ఉంటే మీకు వెంటనే కనెక్షన్ ఏర్పాటు చేయిస్తాం.

ఇంటిపై 11కేవీ లైన్ వెళుతుంది. గాలి దుమారం వస్తే తీగలు ఎక్కడ తగిలి ఏంజరుగుతుందో భయంగా ఉంది...

-ఇస్లావత్ కాశీరాం, రావిచెట్టుతండా, తిరుమలాయపాలెం మండలం

ఈ లైన్ జరిపేందుకు ప్రతిపాదనలు చేశాం. ఇలాంటి సమస్యలున్న ప్రతి చోట లైన్ మార్పునకు పోల్స్ మార్పునకు ప్రతిపాదనలు చేయడం జరిగింది. వెంటనే లైన్ మారుస్తాం.

మొక్కజొన్న చేలో పొలంపై నుంచి 11కేవీ తీగలు వెళుతున్నాయి. అవి కిందకు జారాయి. చేయిపెడితే తగిలే విధంగా ఉన్నాయి. ఇప్పటికే మా మండలంలో విద్యుత్‌షాక్ కారణంగా ఇద్దరు రైతులు చనిపోయారు. త్వరగా తీగలను సరిచేయండి

- రాజు, లచ్చగూడెం, చింతకాని మండలం

ఏఈని పంపించి కిందకు జారిన తీగలను వెంటనే సరిచేసేలా చర్యలు తీసుకుంటాం.

మంగళితండా కరెంట్‌లైన్ సబ్‌స్టేషన్ మార్పువల్ల తరుచు విద్యుత్‌సరఫరాకు అంతరాయం జరుగుతోంది. పెరికసింగారం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తే రైతులకు విద్యుత్ సమస్య ఉండదు.

- యాసం సత్యనారాయణరెడ్డి, రాజుపేట, కూసుమంచి మండలం

దీనిని పరిశీలించి మార్పు చేపిస్తాం

ట్రాన్స్‌ఫారం కోసం రూ.2.48లక్షలు అక్టోబరులో కట్టా. ఇప్పటివరకు రాలేదు. షాపింగ్ కాంప్లెక్స్ మీటర్లు ఏర్పాటుచేయాలి.

-కోపూరి ఇజ్రాయేల్, బోనకల్

ఏఈతో మాట్లాడి సత్వరం ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయిస్తాం

మా గ్రామంలో 21మంది వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేస్తే 16మందికి ఇచ్చారు మాకు ఇంకా రాలేదు....

-రంగిశెట్టి నాగేశ్వరరావు, దేశినేనిపాలెం, మధిర మండలం

ఏఈని పంపి విచారణ చేసి సమస్య పరిష్కరిస్తాం....

ఆరెంపుల గ్రామంలో ట్రాన్సుఫారం గ్రామం మధ్యలో ఉంది. ఒకప్పుడు ఇది ఊరు బయట ఉండగా...ఇప్పుడు ఊరు అభివృద్ధి చెందింది. దీంతో ఈ ట్రాన్స్‌ఫారం ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్‌లైన్ పోతోంది. సత్వరం సమస్య పరిష్కరించండి.

-బండి జగదీష్ మాజీ సర్పంచ్, ఆరెంపుల, ఖమ్మంరూరల్ మండలం

ఎస్ఈ: ఈసమస్య పరిష్కారం కావాలంటే రూ.3నుంచి 4కోట్లనిధులు అవసరం. దీనిని షిఫ్టింగ్ ప్రతిపాదనలో పెట్టాం. నిధులు రాగానే పనులు చేస్తాం.

గొల్లగూడెంలోని మధురానగర్ రోడ్‌నెంబరు4 లో ఓల్టేజీ వచ్చి ఏసీలు పనిచేయడంలేదు. సింగల్ ఫేజ్ ఉంది. త్రీఫేజ్ చేయాలి.

-కె.శ్రీను, గొల్లగూడెం, ఖమ్మం పట్టణం

ఎస్ఈ: సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌లో దీనిని ప్రతిపాదించి త్రీఫేజ్ లైన్ ఏర్పాటు చేస్తాం... సమస్య పరిష్కారం చేస్తాం

గృహజ్యోతి కింద జీరో బిల్లుకోసం దరఖాస్తు చేశాం. కానీ ఇపస్పటి వరకు జీరో బిల్లు రావడంలేదు.

-సునీత, ఖమ్మం త్రీటౌన్

ప్రభుత్వం మంజూరుచేసిన వారికే గృహజ్యోతి బిల్లులు వస్తున్నాయి. మీరు మునిసపిల్ అధికారులకు మళ్లీ దరఖాస్తు ఇవ్వండి

విద్యుత్ వ్యవసాయ కనెక్షన్ మంజూరై రెండేళ్లయింది. మోటారు ద్వారా నీరు కూడా పెడుతున్నాం. కానీ కరెంట్ బిల్లు ఇప్పటి వరకు రాలేదు.

-అచ్చన బీరయ్య, తనికెళ్ల కొణిజర్ల మండలం

మండల ఏఈని మీ దగ్గరకు పంపిస్తాం. మీరు గతంలో కట్టిన డీడీ వివరాలు లైన్ ఎస్టిమేషన్ చెల్లించిన వివరాలు తెలపండి. తక్షణం బిల్లు వచ్చేలా చూస్తాం

అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫారం గ్రామం మధ్యలో ఉంది. దీనిని ఊరి బయటకు మార్పుచేయాలి.

-దండ్యాల వెంకటేవ్వర్లు, కొండాపురం,,ఖమ్మంరూరల్ మండలం

ఈట్రాన్సుఫారం తరలించాలంటే రూ.72వేల ఖర్చవుతుంది. గ్రామ పంచాయతీనుంచి కట్టిస్తే సత్వరం ట్రాన్స్‌ఫారం మారుస్తాం.

మన్నేరు వాగు మామిడితోట ఫిల్టర్ పాయింట్ దగ్గర వాగు పొడుగునా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. నాగులవంచ సబ్‌స్టేషన్ వారికి చెప్పినా పట్టించుకోవడంలేదు.

-అళ్ల జగ్గయ్య, చిన్నమండవ, చింతకాని మండలం

మీ సమస్యకు తప్పనిసరిగా పరిష్కారం ఉంటుంది. కరెంట్ తీగలకు మధ్యలో పోల్స్ వేసి ఎత్తు పెంచుతాం. ప్రమాదం జరగకుండా నివారిస్తాం..

గృహజ్యోతి రావడంలేదు. దరఖాస్తు చేసుకుని ఎంపీడీవో కార్యాలయంలో అడుగుతున్నా. విద్యుత్ అధికారులు మంజూరు చేయాలని చెబుతున్నారు.

-సయ్యద్ ఇసాక్, కల్లూరు

మీ సమస్యను తెలుసుకునేందుకు ఆన్‌లైన్‌లో వెరిఫై చేయించాం. మీది ఎన్‌రోల్ కాలేదు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేయండి.

ఖమ్మం జయనగర్‌కాలనీ 28వ లైనులో పోల్ తీగలు కిందికి ఉన్నాయి. పోల్‌కూడా వంగిపోయింది.

-నర్సయ్య, .జయనగర్‌కాలనీ, ఖమ్మం

లైన్ ఇన్‌స్పెక్టర్‌ను పంపి స్తంభం సరిచేస్తాం. లేకపోతే కొత్త స్థంభం వేస్తాం.

పోస్టుపెయిడ్ మీటరు తీసుకున్నాం. ఆ తర్వాత మీటరు మార్చాం. లక్షరూపాయల బిల్లు వచ్చింది. సమస్య సరిచేయమని దరఖాస్తు పెట్టాం. పరిష్కారంకాలేదు.

-పురుషోత్తం, బస్‌డిపో కాంప్లెక్స్ షాపు, ఖమ్మం

ఇది పైస్థాయిలో సీఈ దృష్టికి తీసకెళ్లి సమస్య పరిష్కారం చేస్తాం.

వేపచెట్లు కరెంట్‌తీగలతో అల్లుకుపోయింది. వర్షం పడితే కరెంట్ షాక్ వస్తుంది.

-పగడాల నాగేశ్వరరావు, బొక్కలగడ్డ, ఖమ్మం

ఏఈని పంపి పరిశీలించి చెట్టు మండలు తొలగిస్తాం. లేదా ఇతర అవసరమైన మార్పులు చేస్తాం.

కరెంట్ ఇనుప స్తంభానికి సపోర్టు వైరును మా ఇంటి కిటీకికి కట్టారు. తరుచు సపోర్టు వైర్‌కు కరెంట్ వస్తుంది. పిల్లలు పట్టుకుంటారన్న భయం ఉంది. వైరును తొలగించండి

-జి.పద్మ, బోనకల్ క్రాస్ రోడ్డు ,ఖమ్మం

సపోర్టు వైరును తక్షణం తొలగిస్తాం. సిబ్బందిని పంపి తనిఖీచేస్తాం. సపోర్టు వైరు ఇళ్లకుకాని కిటికీలకు కాని కట్టకూడదు.

రాజేశ్వరపురం నుంచి అమ్మగూడెం వెళ్లే 11కేవీ లైన్‌లో విద్యుత్ స్తంభాలు దూరంగా ఉండడం వల్ల లైన్‌కిందకు జారింది. చెరుకు ట్రాక్టర్లు పోతుంటే కరెంట్ తీగలు తగులుతున్నాయి. గతంలో చిన్నరోడ్డు ఉన్న దానిని పెద్దరోడ్డు చేశారు. దీంతో స్తంభాల తీగలు రోడ్డు మీదకు వచ్చాయి. తగిన జాగ్రత్తలు తీసుకోండి

-వజ్జ బుచ్చయ్య, కొత్తూరు, నేలకొండపల్లి మండలం

మిడిల్‌పోల్స్‌వేసి కరెంట్ వైర్లను కిందికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పంటలు క్రాప్ కటింగ్ అయిన తర్వాత లైన్‌కూడా ఎత్తులోకి మారుస్తాం. చెరుకు ట్రాక్టర్లకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

మా ఊరి పాత చెరువుకట్ట వద్ద కరెంట్ తీగలు కిందికి ఉన్నాయి. సుబాబుల్ తోటల్లో ఎక్కడా కరెంట్‌షాక్ తగిలి ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అలాగే ఎస్‌సీ కాలనీలో రైతులకు మోటర్ల నిమిత్తం కరెంట్ లైన్ లేక ఇబ్బంది పడుతున్నారు. రూ.3.10లక్షలు ఎస్టిమేషన్ వేశారు. అంత మేం కట్టలేం.

- గోరెల్లి వెంకటేశ్వర్లు, చొప్పకట్లపాలెం, బోనకల్ మండలం

కరెంట్ తీగలను సరిచేసే సమస్య పరిష్కరిస్తాం. అలాగే డబ్బులు కడితేనే లైన్లు వేయడం జరుగుతుంది. లేదా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పుడు పోల్స్‌వేసి కరెంట్ లైన్లు వేసి కనెక్షన్లు ఇస్తాం

చిరునోముల రమేష్ హోటల్ నుంచి సాయిబాబా గుడివరకు స్తంభాలు వేసి లైట్లు ఏర్పాటుచేయాలి. చీకటిగా ఉంది. ఇక్కడ ఇళ్లకు కరెంట్‌లైన్లు చాలా దూరం నుంచి తీసుకున్నారు. కొత్త స్తంభాలు వేయాలి.

-జి.జయరాజు, చిరునోముల , బోనకల్ మండలం

గ్రామ పంచాయతీ నుంచి నిధులు కడితే తక్షణం స్తంభాలు వేయడం జరుగుతుంది. లేనిపక్షంలో ప్రభుత్వం నుంచి గ్రాంటు వచ్చినప్పుడు సమస్య పరిష్కరిస్తాం.

గ్రామంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసి అక్రమ విద్యుత్‌పై కొందరిపై కేసులు నమోదు చేశారు. అది నేను ఫిర్యాదు చేశానని నన్ను గ్రామస్థులు కక్షతో చూస్తున్నారు నాకు ఇబ్బందిగా ఉంది

-వి శ్రీనివాసరావు చింతపల్లి, ఖమ్మం రూరల్ మండలం

మీ గ్రామంలో విద్యుత్ విజిలెన్స్ కేసులకు సంబంధించి నీకు ఎలాంటి సంబంధం లేదు. విద్యుత్‌శాఖ విజిలెన్స్ బృందం జనరల్ తనిఖీల్లో భాగంగా వెళ్లి కేసులు నమోదు చేయడం జరిదింది

కారాగారంలో ధ్యాన శిబిరం



ధ్యానం చేస్తున్న ఖైదీలు

ఖమ్మం క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నగర శివారులోని జిల్లా జైలులో శనివారం ధ్యాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో ధ్యానం చేయించారు. జైలు పర్యవేక్షణ అధికారి ఎ.శ్రీధర్ మాట్లాడుతూ ధ్యానం మానసిక ఒత్తిడిని తగ్గించి ప్రశాంతత చేకూరుస్తుందని, అలాగే చెడు అలవాట్లను దూరం చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్, కోటేశ్వరరావు, శ్రీలత, మమత, జైలర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ జైలర్ సుభాష్ పాల్గొన్నారు.

'అక్షర' వద్ద బాధితుల ఆందోళన

ఖమ్మం క్రైం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): నగరంలోని బైపాస్‌రోడ్డు సమీపంలో అక్షర చిట్‌ఫండ్ కార్యాలయం వద్ద బాధితులు శనివారం రాత్రి ఆందోళన నిర్వహించారు. కంపెనీ యజమాని కొంతకాలంగా కనిపంచకుండా తిరుగుతుండటంతో బాధితులు కొద్ది నెలలుగా కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. శనివారం రాత్రి కంపెని యజమాని ఒకరు ఖమ్మం వచ్చారని తెలిసి బాధితులు కార్యాలయం వద్దకు బారీగా చెరుకున్నారు. డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారని, వెంటనే డబ్బులు ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. కాగా కార్యాలయ సిబ్బంది, బాధితులతో మాట్లాడే ప్రయత్నం చేసినా ఎవ్వరు వినకుండా అక్కడే కుర్చున్నారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలవ వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. కాగా కొంత మందికి ఇవ్వాల్సిన డబ్బులలో కొంత నగదు చెల్లించినట్లు తెలిసింది.

రూ.30 లక్షలు ఇస్తేనే ఒప్పుకుంటాం

సీతారామ భూనిర్వాసితుల ఆందోళన



ఏన్కూరు, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు రూ.30లక్షలు ఇస్తేనే ఒప్పుకుంటామని, గతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైతు ల అధికారులతో వాగ్వాదం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు స్పెషల్ డిప్యూటీకలెక్టర్ కార్యాలయ సిబ్బంది నవీన్‌శర్మ, మౌనిక, వీనీల ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైతు వేదికలో రైతులతో సమావేశం అయ్యారు. రైతులకు ఎకరానికి రూ.20లక్షల చెల్లించేందుకు కలెక్టర్ ఆదేశించారని అధికారులు రైతులకు తెలిపారు. దీంతో రైతులు రూ.20లక్షలకు అంగీకరించమని ఆందోళనకు దిగారు. తమకు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల మెరుగైన ప్యాకేజీ ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తమకు ఎకరానికి రూ.30లక్షల ఇవ్వాలని అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ వినతిని ప్రభుత్వానికి, కలెక్టర్‌కు దృష్టి తీసుకెళ్లి సీతారామ ప్రాజెక్టు లింక్ రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ నవీన్ రైతులు పాల్గొన్నారు.

భూ భారతితో రైతుల భూమికి భద్రత

నెల రోజుల్లో కల్లూరును మునిసిపాలిటీగా ప్రకటిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కల్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూభారతి-2024 చట్టంతో ప్రతి రైతు భూమికి భద్రత కలుగుతుందని రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.5 లక్షల అంచనాతో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి మంత్రి పొంగులేటి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు.

భూభారతి చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో గుర్తించిన విధంగా 2.76 కోట్ల ఎకరాల భూములకు భద్రత ప్రభుత్వం భద్రత కల్పించనున్నాదన్నారు.. గతప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు ఇందిరమ్మ ప్రభుత్వం పరిష్కరిస్తుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణీ చట్టం లోపభూయిష్టంగా ఉందని విమర్శించారు. పేదవాడి చిరకాల కోరికను నేరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ం చేపట్టిందని చెప్పారు. ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం ఎలాంటి నిభందనలు పెట్టలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కింది సొంత స్థలం ఉన్న వారికి రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం నాలుగు దశలలో అందించటం జరుగుతుందన్నారు. గత ప్రజాపాలనలో రాష్ట్రం వ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి సేకరించి ప్రకారం 80 లక్షల మంది దరఖాస్తులు చేసుకుగా వారిలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఈ నెలలోగా పూర్తి చేయనున్నామని చెప్పారు. ఈ సభలో ఎంపి రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసి చైర్మన్ బాగం నీరజాదేవిలు ప్రసంగించారు.

కల్లూరుకు మంత్రి వరాల జల్లు...

కల్లూరును మరో నెల రోజుల్లో మునిసిపాలిటీగా ప్రకటింప చేస్తానని మంత్రి కల్లూరు సభలో ప్రజలకు హామీ ఇచ్చారు. ఇంకా డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరు చేయిస్తామన్నారు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటుపై కూడ మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ సభలో ముందుగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఈ ప్రాంత ప్రజల తరుపున పై సమస్యలను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకోరాగా మంత్రి స్పందించి తగిన విధంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఆర్డిఓ రాజేంద్రగౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, తక్కేళ్లపాటి ప్రసాదు, బాగం ప్రభాకరచౌదరి, ఏనుగు సత్యంబాబు, భూక్యా శివకుమార్‌నాయక్ పలు మండలాల కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచమంతా కమ్యూనిజం వైపు మళ్లుతోంది

వర్గపోరాటాలను విస్తృతంగా నిర్వహించాలి

మిలిటెంట్ పోరాటాలకు కేంద్రంగా మారాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్



సభకు హాజరైన సీపీఎం శ్రేణులు

ఇల్లెందు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టు సిద్ధాంతాలే శరణ్యమయ్యాయని సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు బి. వెంకట్ స్పష్టం చేశారు. ఇల్లెందులో శనివారం సీపీఎం జిల్లా మూడో మహాసభలు రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు, ప్రజలు కమ్యూనిజం వైపే మళ్లుతున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలను బలోపేతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అఖిలభారత స్థాయిలో భద్రాద్రి జిల్లా ఉద్యమాలను గుర్తించేలా చేపట్టాలని కోరారు. కేరళ తరహా క్షేత్రస్థాయిలో ఉద్యమాలకు నాంది పలకాలన్నారు. దళిత, గిరిజన సమస్యలు వర్గపోరాటాల సమస్యల పట్ల పెద్దఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. కేరళ తరహా ఉద్యమాలకు తెరలేపాలన్నారు. మిలిటెంట్ పోరాటాలకు భద్రాద్రి జిల్లా కేంద్రం కావాలని ఉద్యమాలకు, పోరాటాలకు అనుకూలమైన వాతావరణం జిల్లాలో ఉందని వెల్లడించారు. ఆదివాసీ గిరిజన జాతుల పట్ల జరిగే అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తారో.. అక్కడ కమ్యూనిస్టుల ఆధిపత్యం పెరుగుతున్న విషయాన్ని గమనించాలని కోరారు.

రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధిహామీ పనుల అవకతవకలు, కూలీల పెంపకం, వేతనాల చెల్లింపుల కోసం నిరంతరం పోరాటం చేయాలని, దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు అనుకూలమైన వాతావరణం ఉందని దీన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని నిత్యం ప్రజల్లో ఉండి ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి కేంద్రీకరించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రెండో రోజు మహాసభల్లో మాజీ ఎంపీ మీడియం బాబురావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే. రమేష్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఎస్ఏ. నబీ, ఆలేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

కూసుమంచి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్యాంపు ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన దైవజనులు, క్రైస్తవసోదరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేష్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ఈజీ రైడ్ ఈవీ బైక్

(5వ పేజీ తరువాయి)

వాహనాలకు జీవితకాల పన్ను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. 2026 డిసెంబర్ వరకు ఈ అవకాశం కల్పించారు. దాంతో ఎలక్ట్రిక్ కార్లు, ఆటోలు, బైక్‌లు కొనుగోలు చేసేవారికి వేలల్లోనే లబ్ధి చేకూరే అవకాశం ఉంది. అయితే దీనికి సంబంధించిన జీవోలు ఇంకా రావాల్సి ఉంది.

ఖర్చు, కాలుష్యం తక్కువ..

ఈవీ బైక్‌లు పర్యావరణహితంగా ఉంటాయి. ఈ వాహనాల్లో ఎలాంటి ద్రవ, ఘన ఇంధనాలు వినియోగించాల్సిన అవసరం లేకపోవడంతో గాలిలో ఎలాంటి కర్బన పదార్థాలు విడుదలయ్యే ప్రమాదం లేదు. దాంతో ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగిస్తే వాయు కాలుష్యం తగ్గే అవకాశం ఉంటుంది. ఇక పెట్రోల్ ఖర్చు లేకపోవడం కూడా ప్రజలు 'ఈవీ'ల వైపు మొగ్గు చూపేలా చేస్తోంది. ప్రస్తుతం పెట్రోల్ ధర రూ.110కి చేరింది. లీటర్ పెట్రోల్ పోస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల మైలేజ్ వస్తుంది. అదే సమయంలో బ్యాటరీ వాహనాలకు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 60 నుంచి 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించే బైక్‌లు ఉన్నాయి. ఇంత దూరం ప్రయాణం చేయటానికి విద్యుత్ కేవలం రెండు నుంచి నాలుగు యూనిట్లే అవసరం అవుతుంది. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుతు అందిస్తుండడంతో ముఖ్యంగా పల్లెల్లో ఎలక్ట్రిక్ బైక్‌లు వాడే వారికి చాలా ఉపయోగకరంగా ఉంది. విద్యుత్ వాహనాలకు నెలకు 50 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగం కావడం లేదు. ఈ లెక్కన ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ఉచితంగానే విద్యుత్ లభిస్తుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

గతంలో పలుచోట్ల ఎలక్ట్రిక్ బైక్‌లలో బ్యాటరీలు పేలిపోయిన ఘటనలు ఉన్నాయి. అయితే 'ఈవీ'లు కొనుగోలు చేసిన అనంతరం తగు జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. వాహనాలకు కంపెనీలు అందించిన చార్జర్‌ను మాత్రమే ఉపయోగించాలి. ఛార్జింగ్ పెట్టే ప్రదేశం వద్ద తేమ, నీరు లేకుండా చూసుకోవాలి. బ్యాటరీ పూర్తిగా చార్జ్ అయిన తరువాత ఛార్జర్‌ను తొలిగించాలి. కంపెనీలు సూచించిన వేగంతోనే బైక్‌ను నడపాల్సి ఉంటుంది. ఏదైనా సమస్య ఏర్పడినపుడు కంపెనీకి సమాచారం అందించి ఆ కంపెనీకి చెందిన మెకానిక్‌ల ద్వారానే మరమ్మతులు చేయించుకోవాలి.

కాలుష్యం అనేదే ఉండదు...

రవి, అశ్వారావుపేట

లోకల్‌లో తిరగటానికి విద్యుత్ వాహనం ఎంతో మేలు.. ఒకసారి ఛార్జింగ్ పెడితే 110 కిలోమీటర్లు తిరుగుతున్నా. లక్ష ఖర్చు చేసినా సంతృప్తికరంగానే ఉంది. దీనికితోడు ఎటువంటి కాలుష్యం లేదు. రిపేర్ వచ్చినా కంపెనీ వాళ్లే వచ్చి చేస్తున్నారు. మూడేళ్ల పాటు వారంటీ కూడా ఉంది. కాలుష్య రహితంగా ఉండటం వల్ల వాడకానికి వీలుగా ఉంది. లోకల్‌గా తిరగడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది.

పోలీసుల అదుపులో..

అంతర్ జిల్లా దొంగల ముఠా..?

ట్రాక్టర్ ట్రాలీల రికవరీ

కూసుమంచి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అత్యంత చాకచక్యంగా ట్రాక్టర్ ట్రాలీల చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగలను కూసుమంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు నిందితులను తమదైన శైలిలో విచారించిన పోలీసులు వివిధ ప్రాంతాల్లో చోరీ చేసిన ట్రాక్టర్‌లను, ట్రాలీలను రికవరీ చేసినట్లు తెలిసింది. సూర్యాపేట జిల్లా మునగాల, గరిడేపల్లి మండలాలకు చెందిన ముగ్గురు నిందితులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ ట్రాక్టర్‌లను ట్రాలీలను చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల చేగొమ్మ గ్రామంలో ట్రాక్టర్ ట్రాలీ చోరీకిగురవగా పోలీసులు సాంకేతిక ఆధారంగా కూపీలాగారు. దీంతో నిందితులను విచారించగా ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడింది, ఎక్కడ విక్రయించింది చెప్పడంతో రికవరీ చేశారు. జల్సాలకు అలవాటుపడి నేరాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు త్వరలో వివరాలు వెల్లడించనున్నారు.

31నుంచి ఏకాదశి అధ్యయనోత్సవాలు

- 31 నుంచి దశవతారాల్లో భద్రాద్రి రామయ్య
- జనవరి 9న పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం
- 10న ఉత్తరద్వారంలో దర్శనమివ్వనున్న స్వామి వారు



భద్రాచలం,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల31 నుంచి శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా స్వామివారు తొలి పది రోజుల పాటు ఒక్కొక్క అవతార అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.ఈనెల31 నుంచి జనవరి 20వరకు ఈ అధ్యయనోత్సవాలను నిర్వహించనున్నారు. జనవరి 9న పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం, 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారంలో స్వామి వారు దర్శనమివ్వనున్నారు. కాగా జనవరి 21నుంచి 23వరకు విలాసోత్సవాలు నిర్వహించనున్నారు.

జనవరి 9న తెప్పోత్సవం...

భద్రాచలంలోని గోదావరి నదీ తీరంలో స్వామి వారి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇదే సమయంలో తిరుమంగై ఆళ్వారు పరమ పదోత్సవాన్ని సైతం మధ్యాహ్నం సమయంలో రామాలయంలో నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా జనవరి 10నుంచి రాపత్తు ఉత్సవాలు జరుగనున్నాయి. తొలుత ఎఎస్పీ బంగ్లాలోని శ్రీరామ రక్ష మడపంలో నిర్వహిస్తారు. 11న అంబాసత్రంలోని హరిదాస మండపం, 12న శ్రీఅభయాంజనేయస్వామి వారి ఆలయం, 13నశ్రీ గోవింద మండపం, 15న పునర్వసు మండపం, 16న శ్రీకృష్ణాలయం, 17న విశ్రాంత మండపం, 18న వేస్ట్‌ల్యాండ్స్‌లో 19న చిత్రకూట మండపం, 20న రెవిన్యూ ఆఫీసుకు సంబంధించి బస్టాండు వెనుక గల శ్రీరామదాసు మండపంలో స్వామి వారికి రాపత్తుసేవలు నిర్వహించనున్నారు. కాగా 14న మకర సంక్రాంతి సందర్భంగా స్వామి వారికి రథోత్సవం నిర్వహిస్తారు.

జనవరి 17న కల్కి అవతారం

కలియుగంలో చివరి భాగంలో పాపపంకిలమైన భూమిపై ఉన్న దుష్టులను శిక్షించడానికి ధర్మాన్ని నెలకొల్పడానికై శంబళగ్రామంలో శ్రీమన్నారాయణుడు కల్కి అవతారాన్ని దర్శిస్తాడు. బుధగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే విముక్తి పొందుతారు.

21 నుంచి విలాసోత్సవాలు

భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో విలాసోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 21న పంచాయతీ కార్యాలయం వద్ద, 22న దసరా మండపం, 23న వశిష్ఠ మండపం వద్ద దేవస్థానం సిబ్బంది ఆధ్వర్యంలో విలాసోత్సవాలు నిర్వహిస్తారు.

జనవరి 26న విశ్వరూప సేవ

"అంతా రామమయం" అంటూ భక్త రామదాసు, శ్రీరాముని "సర్వవ్యాపకుడ"ని కీర్తించారు. వైకుంఠ ఏకాదశికి పదిహేను రోజుల తర్వాత వచ్చే బహుళ ద్వాదశి నాడు భద్రాచల దేవస్థానంలోని ఉపాలయాలలో పూజలందుకొనే మూర్తులందరినీ శ్రీరామచంద్రమూర్తితోపాటుగా ఒకే మండపంలో వేంచేపు చేసి, మహాప్రభుత్వోత్సవాన్ని నిర్వహించడాన్నే విశ్వరూప సేవగా సంభావిస్తారు.

అధ్యయనోత్సవాలంటే..

భద్రాద్రి రామునికి జరిగే సంవత్సర ఉత్సవాల్లో ప్రసిద్ధి పొందిన ఉత్సవం వైకుంఠ ఏకాదశి.. దీనిని మధ్య మణి పూసగా చేసుకొని ముందు పది రోజులు, తరువాత పది రోజులు 21 రోజుల పాటు వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు అధ్యయనోత్సవాలని మరోపేరు.. ముందు జరిగే పది రోజులకు పగల్‌పత్తు అని, తరువాత జరిగే పదిరోజులకు రాపత్తు అనిపేరు. ఈ అధ్యయనోత్సవాల్లో రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అదర్వవేదం, రామాయణం, క్షేత్రమహత్యం, శ్రీబాష్యం, పాంచరాత్రగమం, శ్రీవైష్ణవ సంప్రదాయంలో మహాభక్తులుగా కొనియాడబడే పన్నిద్దరు ఆళ్వార్లచే రచింపబడిన నాలుగువేల పాశురములు గల నాలాయర దివ్యప్రబంధం, స్తోత్రాలు అధ్యయనం చేస్తారు. పగల్‌పత్తులోరామచంద్రమూర్తిని రోజుకు ఒక అలంకారంతో దశావతారాలు అలంకరిస్తారు. రాపత్తు ఉత్సవాలలో ఆయా ప్రాంతాలలో స్వామి వారి సేవ నిర్వహిస్తారు. 21 రోజుల తరువాత విలాసోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. ఇలా శ్రీవైష్ణవ సంప్రదాయానుసారం పాంచరాత్రగమ విధానంగా అధ్యయనోత్సవాలు శోభాయమానంగా జరుగుతాయి.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

- ఖమ్మంలో పాల్గొన్న 3602 మంది క్రీడాకారులు
- 610 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఖమ్మం జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న సీఎంకప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. మొత్తం ఆరు రోజులు పాటు 36 క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 21మండలాల నుంచి సుమారు 3602మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ చూపిన 610 మంది క్రీడాకారులను ఈనెల27 నుంచి జనవరి2 వరకు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. పోటీల్లో భాగంగా శనివారం యోగా, ఖో-ఖో, బాస్కెట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. పోటీలను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి జిల్లాక్రీడా సంఘాల బాధ్యులు షఫీ, సాంబమూర్తి, ఆదర్శ్‌కుమార్, కోచ్‌లు గౌస్, అక్బర్‌అలీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి పర్యవేక్షించారు.





చివరి రోజు విజేతలు వీరే

యోగా బాలుర విభాగంలో లక్ష్మీప్రణీత్ ప్రథమ, రంజిత్‌కుమార్ ద్వితీయ, నవదీప్ తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో తమరస ప్రథమ, శ్రీవల్లి ద్వితీయ, అక్షర తృతీయ స్థానాల్లో నిలిచారు. బాస్కెట్ బాల్ ఉమెన్స్ విభాగంలో సర్దార్ పటేల్ స్టేడియం జట్టు ప్రథమ, పీవీఆర్ స్పోర్ట్స్‌క్లబ్ జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఖో-ఖో బాలికల విభాగంలో ఎర్రుపాలెం జట్టు ప్రథమ, మధిర జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

పోరాటాలే సమస్యలకు పరిష్కారం

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 21: పోరాటాల ద్వారానే విద్యార్థుల సమస్యలకు పరిష్కారాలు జరుగుతాయని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర నాయకుడు రాయల రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంఘా రాష్ట్ర పోరాటాలను వివరించారు. ఫీజురియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు బకాయిలపై నిర్విరామ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న వసతిగృహాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. నాయకులు వినయ్, శ్రీకాంత్, పృధ్వి, సందీప్, చంద్రశేఖర్, శ్రీను, యశ్వంత్, ప్రసాద్, అశోక్, సాధిక్, వెంకటేష్, త్రివేణీ, సమీరా పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి గురుకులాల క్రీడాపోటీలు

- అండర్ 14 విభాగంలో ఓవరాల్ చాంపియన్ భద్రాద్రి జిల్లా
- సత్తాచాటిన వివిధ జిల్లాల క్రీడాకారులు

పాల్వంచరూరల్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా జరుగుతున్న సోషల్ వెల్ఫేర్ గురుకులాల క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఓవరలాల్ చాంపియన్స్‌గా నిలిచిన జట్లకు అవార్డులను అందచేశారు. ఈ కార్యక్రమానికి డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు హాజరయ్యారు. గురుకులాల్లో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశనుంచే లక్ష్యంతో క్రీడలపై మక్కువ పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రప్రతిష్ఠతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురుకులాల ఓఎస్‌డి కే.వి వేకానంద్, జోనల్ స్పోర్ట్స్ మీట్ ఇన్‌చార్జ్ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, జోనల్ అధికారులు స్వరూపరాణి, ప్రత్యూష, విజయరాణి, ప్రిన్సిపల్ పీవీఎన్. పాపారావు, ప్రిన్సిపల్ డాక్టర్ కన్నెకంటి వెంకటేశ్వర్లు, పద్మావతి, ఐనాల సైదులు, రంగారావు, పీడీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అండర్14 విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అండర్ -17 విభాగంలో చార్మినార్ జోన్, అండర్-19 విభాగంలో జోగులాంబ జిల్లాల జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. వీరిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయిలో గెలుపొందిన జట్లు

అండర్-14విభాగంలో కబడ్డీ ప్రథమస్థానంలో భద్రాద్రి జిల్లా, ద్వితీయ స్థానంలో రాజన్న సిరిసిల్ల, ఖోఖో పోటీల్లో ప్రథమస్థానం కాళేశ్వరం జోన్, ద్వితీయస్థానం భద్రాద్రి జోన్, టెన్నికాయిట్ డబుల్స్‌లో ప్రథమస్థానం రాజన్నసిరిసిల్ల, ద్వితీయస్థానం భద్రాద్రిజిల్లా నిలిచాయి. అలాగే చదరంగం పోటీల్లో ప్రథమ స్థానం రాజన్న సిరిసిల్ల, ద్వితీయస్థానం యాదాద్రి, క్యారమ్స్ డబుల్స్ ప్రథమస్థానం బాసరజోన్, ద్వితీయ స్థానం భద్రాద్రి జోన్, అండర్ -17 విభాగంలో కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానం యాదాద్రి జోన్, ద్వితీయస్థానం భద్రాద్రిజోన్ నిలిచాయి. ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం భద్రాద్రిజిల్లా, ద్వితీయ స్థానం కాళేశ్వరం, వాలీబాల్‌పోటీల్లో ప్రథమస్థానం రాజన్నసిరిసిల్ల, ద్వితీయస్థానం బాసర విజేతలుగా నిలిచారు. బాల్‌బ్యాట్మంటన్ పోటీల్లో ప్రథమస్థానం యాదాద్రి జోన్, ద్వితీయస్థానం కాళేశ్వరం జోన్, ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమస్థానం యాదాద్రి జోన్, ద్వితీయస్థానం చార్మినార్ జోన్, టెన్నికాయిట్ పోటీల్లో ప్రథమస్థానం కాళేశ్వరం జోన్, ద్వితీయ స్థానం భద్రాద్రి జోన్ నిలిచాయి.



ఓవరాల్ చాంపియన్ జట్టుకు చాంపియన్ షిప్‌ను అందచేస్తున్న కొత్వాల

అండర్-19 విభాగంలో..

కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానం జోగులాంబ జోన్, ద్వితీయస్థానం భద్రాద్రిజోన్,ఖోఖో పోటీల్లో ప్రథమస్థానం రాజన్న సిరిసిల్ల జోన్ ద్వితీయ స్థానం కాళేశ్వరం గెలిచాయి. బాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానం చార్మినార్ జోన్, ద్వితీయ స్థానం జోగులాంబ జోన్, బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం బాసర జోన్, ద్వితీయ స్థానం యాదాద్రి, హ్యాండ్ బాల్‌పోటీల్లో ప్రథమస్థానం కాళేశ్వరం, ద్వితీయస్థానం చార్మినార్ జోన్ నిలిచాయి. ఫుట్ బాల్ పోటీల్లో ప్రథమస్థానం జోగులాంబ జోన్, ద్వితీయస్థానం చార్మినార్. చదరంగంలో ప్రథమ స్థానం భద్రాద్రి జోన్, ద్వితీయ స్థానం యాదాద్రి జోన్లకు చెందిన క్రీడాకారులు గెలుపొందారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



సత్యం(ఫైల్)

మణుగూరు రూరల్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కూనవరంలో గల ప్రభుత్వ పాఠశాల వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూనవరం గ్రామానికి చెందిన నూపా సత్యం (46) ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. శనివారం మట్టిలోడ్‌తో కూనవరం వైపునకు వెళ్తుండగా, ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో అతడు తీవ్రంగా గాయ పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మేడా ప్రసాద్ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సీతారాంపురంలో యువకుడు...

అశ్వాపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీతారాంపురం గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతి చెందగా, ఇద్దరు చిన్నారులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎటపాకకు చెందిన అలవాల సాయిరాం(25) తన ఇద్దరు చెల్లెల్లతో కలసి బైక్ పై మండల పరిధిలోని చింతిర్యాల కాలనీకి చెందిన బంధువుల ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో సీతారాంపురం వద్ద మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తున్న మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రహదారిపై గుంతలను తప్పించబోయి వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సాయిరాం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన ఇద్దరు చిన్నారులను స్థానికులు చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మునిసిపల్ ఉద్యోగి ..



గణేష్(ఫైల్)

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో 1వ వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి తోట గణేష్ (24) హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వేంసూరు మండలం మర్లపాడుకు చెందిన ఈయన 2022నుంచి సత్తుపల్లి మునిసిపాలిటీలో ఉద్యోగిగా పనిచేస్తుండగా గతనెల 30వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పు రుగుమందు సేవించగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా పదేళ్ల క్రితం గణేష్ తండ్రి మృతిచెందడంతో కారుణ్య నియామకాలలో భాగంగా ఉద్యోగంలో చేరాడు. మునిసిపాలిటీ ఉద్యోగులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

వృద్ధురాలిపై దాడి.... బంగారు నగలు చోరీ

తిరుమలాయపాలెం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలిపై దాడిచేసి ఆమె మెడలోని తులంన్నర బంగార గొలుసును ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన ఆరెంపుల వెంకమ్మ (65) ఇద్దరు కుమారులున్నారు. కాగా ఆమె పిండిప్రోలు వారపుసంతంలో చీపుర్లు, తాళ్లు అమ్ముకుని జీవిస్తుంది. శుక్రవారం రాత్రి ఇంటిలో ఒంటరిగా నిద్రిస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అర్ధరాత్రి వచ్చి ఆమెపై దాడి చేసి, మెడలోని తులంన్నర బంగారం వస్తువులు ఎత్తుకెళ్లారు. ఆమె కేకలు వేయడంతో ఆమెపై రాయితో తలపై దాడిచేశారు. దీంతో ఉదయం గ్రామస్తులకు, పోలీసులకు తెలపడంతో వెంటనే పోలీసులు నిందితుల కోసం ఆరా తీశారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ బి.తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, ఎస్‌ఐ జగదీష్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధిక పనిభారంతో
అంగన్‌వాడీల సతమతం

- సొంత శాఖ సేవలకు నాయ్యం చేయని పరిస్థితి
- ఇతర శాఖల సేవలకు పరిమితం
- తాజాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అంగన్‌వాడీలు
- తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న వైనం



ఇందిరమ్మ సర్వేకు అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరు/ఖానాపురంహవేలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు తమ సొంతశాఖ సేవలతో పాటుగా, ప్రభుత్వం పరంగా అమలు జరగనున్న ఇతర శాఖల సేవలు అప్పగించడంతో అధిక పని భారంతో సతమతమవుతున్నారు. గత నవంబరు మాసాంతం కుల గణన, కుటుంబ, ఆర్థిక, విద్య రాజకీయ సామాజిక స్థితిగతులపై సర్వే విధులు నిర్వహించారు. తాజాగా జిల్లా అధికారులు ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ గృహాల సర్వే బాధ్యతలు అప్పగించడంతో జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజు టీచర్లు గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు ఆరు రకాలుగా సేవలు అందించాల్సి ఉంది. దీంతోపాటుగా కేంద్రాల ద్వారా పోషక ఆహారం అందించాలి. అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు సొంతశాఖ సేవలకు అంతరాయం కలిగేలా వారిపై ఇతర శాఖల బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ పరిస్థితుల్లో తమ సొంతశాఖ సేవలకు న్యాయం చేయలేక పోతున్నామని అంటున్నారు. జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో 1,890 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం గ్రామాల్లో పారిశుద్యం, వైద్య శాఖ సేవల కార్యక్రమాలతో పాటుగా, ఓటర్ల నమోదులో బీఎల్‌వోగా నియమించి వారి సేవలను ఇతర శాఖ అధికారులు వినియోగించుకుంటున్నారు.

ఇంకా తెలంగాణ ప్రభుత్వం తాజాగా గత నవంబరు నెలలో ఇంటింటా కుటుంబ సర్వేలో నెల రోజుల పాటుగా విధులు నిర్వర్తించారు. గురువారం నుంచి మరోసారి ఇందిరమ్మ గృహాల సర్వేలో కూడా బాధ్యతలు అప్పగించారు. మరో వైపున అంగన్‌వాడీ టీచర్లు ఇంత చేస్తున్న తమ సొంత శాఖ సేలను కూడా పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఇలా ప్రభుత్వం వారికి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పనిభారం పెరిగి తీవ్రమైన ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. ఇందిరమ్మ సర్వేలో కూడా ప్రతి మండలం నుంచి 15 నుంచి 20 మంది టీచర్లు సేవలు చేస్తున్నట్లు తెలిసింది.

ఇలా జిల్లా వ్యాప్తంగా పలు ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ టీచర్లు అధిక పనిభారంతో అవస్థలు పడుతన్నారని తెలిసింది. ఇలా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న శాశ్వత ఉద్యోల కంటే అదనపు పని భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇకనైన ఇతర శాఖల సేవలకు వినియోగించకుండా తమ సొంతశాఖ సేవలకు పరిమితమయ్యేలా దృష్టి సారించాలని పలువురు అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పేకాటస్థావరంపై దాడి..

- 8మంది అరెస్ట్.. ► రూ.3.80లక్షల స్వాధీనం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ టీ.కిరణ్ శనివారం తెలిపారు. ఈ దాడిలో 19 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో 8 మంది వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. వారివద్ద నుంచి రూ.3.80లక్షలు నగదు, 8సెల్‌ఫోన్లు, 6ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోగా, మిగతా 11మంది పరారయ్యారని, వారిపైన కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జమలాపురం శ్రీవారికి ముత్యాల కవచ అలంకారం



శ్రీవారిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ఎల్వీ నారాయణ రెడ్డి, బొబ్బా ప్రసాద్, వి.వెంకటకృష్ణారావు, లీలాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల దొంగ అరెస్ట్

- నిందితుడి నుంచి 8 వాహనాలు స్వాధీనం

అశ్వారావుపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాహనాలను చోరీ చేసి తక్కువ ధరకు అమ్ముకునే ఓ దొంగను శనివారం అశ్వారావుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం..తూర్పుగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, యాదవోలుకు చెందిన మారం మునియ్య చాలా కాలంగా ద్విచక్రవాహనాలు చోరీ చేస్తూ వస్తున్నాడు. ఇతను ఇటీవలే ఎనిమిది ద్వి చక్రవాహనాలను పలు ప్రదేశాలలో చోరీ చేశాడు. వీటిని విక్రయించే పనిలో భాగంగా శనివారం ఓ వాహనాన్ని వేసుకొని అశ్వారావుపేటకు వస్తుండగా, స్థానిక సాయి బాబా మందిరం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. విచారణలో ఎనిమిది వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడు చెప్పిన ప్రదేశం వద్దకు వెళ్లి మిగతా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతను 2020-21 సంవత్సరాలలో రెండుసార్లు రాజమండ్రి జైలులో జైలు శిక్షణను అనుభవించాడని, 61 కేసులు ఇతడిపై పలు స్టేషన్‌లలో నమోదు అయినట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ యయాతి రాజు, క్రైమ్ పార్టీ సిబ్బంది నాగేంద్ర రావు, ఎన్. వెంకటేశ్వరరావులు పాల్గొన్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

బందాల దేవరగుట్ట అటవీ ప్రాంతంలో
పెద్దపులి పాద ముద్రలు



మోతే అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో దేవరగుట్ట ప్రాంతంలో పెద్దపులి పాద ముద్రలు)

కరకగూడెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలో పెద్దపులి సంచారంతో ఇరు జిల్లాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రత్నగిరి నుంచి వచ్చిన పెద్దపులి ఆడపులి జాడ కోసం పలు రోజులుగా కరకగూడెం, తాడ్వాయి మండలాల్లో గాలింపు చేపడుతున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలుపుతున్నారు. తాడ్వాయి మండలం బీరెల్లీ, కొశెట్టివాయి, కాటపురం, నర్సాపూర్ బందాల దేవరగుట్ట నార్త్ బీట్‌లో శనివారం తాడ్వాయి అటవీ శాఖ అధికారులు పెద్దపులి పాద ముద్రలను గుర్తించినట్లు మణుగూరు డివిజన్ ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మొహిద్దీన్ తెలిపారు. పెద్దపులి ఆడపులి జాడ కోసం సంచరిస్తుందని మరలా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ ప్రాంతాలకు వస్తుందని తెలిపారు. ప్రజలు ఎవ్వరూ అటవీ ప్రాంతాలకు వెల్లవద్దని తెలిపారు. ఇటీవల పెద్దపులి సంచరించిన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. అటవీ ప్రాంతాలలో అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.



మత్తు పదార్థాల నివారణపై అవగాహన

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి):నగరంలోని రాపర్తినగర్ మైనారిటీ బాలికలు కళాశాలలో శనివారం మత్తు పదార్థాల నివారణ.. పరీక్షల ఒత్తిడిపై విద్యార్థులకు నివారణపై అవగాహన సదస్సు నిర్వమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నార్కోటిక్ టీం సీఐ రాము, టెలీ మానస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కృష్ణ చైతన్య హాజరయ్యారు. మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు బాధ్యతాయుత నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలను నిరోధించటంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. టోల్ ఫ్రీనెంబర్ 1908,కంట్రోల్‌రూం నెంబరు 8712671111 లను సంప్రదించాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని అధికమించటానికి పలు అంశాలను వివరించారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	24 రూ.
వంకాయ	40
గుత్తి వంకాయ	48
బీరకాయ	58
పచ్చిమిర్చి	30
కాకరకాయ	44
బెండకాయ	40
పొట్లకాయ	38
దోసకాయ	34-44
చిక్కుడు	48
నాటుచిక్కుడు	88
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	28
దొండ	60-66
సొరకాయ	20
క్యారెట్	38
క్యాప్సికం	68
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	195
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	విడుదల
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

రూ.12లక్షల సొత్తు అపహరణ

- తాళం పగులగొట్టి అపార్టుమెంట్‌లో చోరీ



తాళం పగులు గొడుతున్న దొంగ

ఖమ్మంక్రైం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఓ ప్లాటులో ఓ యువకుడు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం తెల్లవారుజామున ఖమ్మంలో జరిగింది. టూటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. నగరంలోని ఆర్టీవో కార్యాలయ బైపాస్ రోడ్డు సమీపంలోని అపార్టుమెంట్‌లో 4వఫ్లోర్‌లో లకావత్ దేవదాస్ నివాసం ఉంటున్నాడు. అతను సత్తుపల్లిలో సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. వారం రోజుల కిందట కుటుంబంతో కలిసి సత్తుపల్లికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ప్లాటులో తలుపు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడు. శనివారం ఉదయం ఫ్లోర్ ఊడ్చేందుకు వాచ్‌మెన్‌పైకి రాగా తాళం పగులగొట్టి కనిపించింది. దీంతోవాచ్‌మెన్ అపార్టుమెంట్ యాజమాన్యానికి, నివాసం ఉంటున్న వారికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి చూడగా ఇంటిలోని 40తులాల బంగారు ఆభరణాలు,580గ్రాముల వెండి వస్తువులతో పాటు కొంత నగదు కనిపించలేదు. వెంటనే వారు టుటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు క్లూస్‌టీంతో సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. పోయిన సొత్తు సుమారు రూ.12లక్షల వరకు ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. జరిగిన సంఘటన సీసీ కెమేరాలో రికార్డు కావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇప్పటికే సీసీ కెమేరా ఆధారంగా నిందితుడిని గుర్తించినట్టు సమాచారం.

ముస్తఫానగర్‌లో మరో ఇంట్లో..

నగరంలోని ముస్తఫానగర్‌లో నివాసం ఉంటున్న ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాసరావు ఇంటిలో శనివారం చోరీ జరిగింది. శ్రీనివాసరావు కుటుంబంతో కలిపి ఈనెల 19న వేరే ఊరు వెళ్లారు. ఈక్రమంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటిలోని సుమారు 60గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

అధికారులు వస్తే రుచికరం.. లేదంటే అధ్వానం

- ఉడకని అన్నం, పురుగులు వస్తున్నా పట్టించుకోని వైనం
- చన్నీళ్ల స్నానం, అదీ ఒక్కపూటే..
- వెలుగుమట్ల కేజీబీవీలో విద్యార్థినుల అవస్థలు



గేటు వద్ద పిల్లల కోసం ఎదురు చూస్తున్న తల్లిండ్రులు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెలుగుమట్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అసౌకర్యాలతో విద్యార్థినులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలల నుంచి ఉడకని అన్నం, పురుగులు వస్తున్నాయని చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. చలికాలంలో వేడి నీళ్లు అందించకపోవటంతో తెల్లవారుజామున 5గంటలకే తమ పిల్లలు చల్లని నీటితో స్నానాలు చేయవల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

చన్నీళ్లే దిక్కు

ఇక్కడ 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం విద్యార్థులు 350వరకు ఉన్నారు. ఇంటర్ విద్యార్థులు 100 మంది వరకు, మిగిలి విద్యార్థులు 6నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. కేజీబీవీలో రెండే వాష్‌రూమ్‌లు ఉండటంతో తెల్లవారుజాము 5గంటలకే స్నానాలకు దిగాల్సి వస్తోందని, వేడి నీళ్లు లేక వణికించే చలిలో సైతం చన్నీటి స్నానం తప్పడం లేదని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఈ శీతాకాలం వరకైనా వేడి నీళ్లు అందించాలని వేడుకున్నా పట్టించుకోవడం లేదని, 'ఉంటే ఉండండి... పోతే పోండి..' అని కొందరు ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల కారణంగా చదువు కొనసాగిస్తున్నామని ఇంటర్మీడియట్ విద్యార్థినులు చెబుతున్నారు.

అధికారులు వచ్చిన రోజే నాణ్యత

ఇకఅధికారులు వచ్చే సమయాల్లో మాత్రం మధ్యాహ్న భోజనం, కూరలు రుచికరంగా తయారు చేస్తారని, మిగిలిన సమయాల్లో అధ్వానంగా ఉంటుందని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో విద్యార్థులతో మూత్రశాలలు, పాఠశాల ప్రాంగణం శుభ్రం చేయిస్తున్నారని ఓ విద్యార్థిని తండ్రి ఆరోపించాడు. అన్నం సరిగా ఉండటంలేదని, పురుగులు వస్తున్నాయని, తాను ఇక్కడ ఉండటం కష్టంగా ఉందని తన కూతురు చెబుతోందని ఆయన తెలిపాడు. తాము తమ పిల్లలను కలవడానికి వస్తే కేజీబీవీ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని, తమను గంటల తరబడి నిలబెట్టి యాతన పెడుతున్నారని పలువురు తల్లిదండ్రులు వాపోయారు.

మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించాలి

- సీఎంకి వినతిపత్రం అందించిన కాంగ్రెస్ నాయకులు వక్కలగడ్డ



సీఎంకి వినతిపత్రం అందిస్తున్న వక్కలగడ్డ

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంలో మాదిగ సామాజిక వర్గం విశేషంగా కృషి చేసిందని, అందుకే ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో మాదిగ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు వక్కలగడ్డ చంద్రశేఖర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో శనివారం ముఖ్యమంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ గెలుపులో మాదిగలు కృషి చేశారని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వివరించారు. మాదిగలకు నామినేటెడ్ పదవులు కేటాయింపుపై అవసరమైతే ఏబీసీ అధ్యక్షుడి తన పేరును సిఫారసు చేయాలని కోరారు.

ఉద్యోగుల ఉద్యమానికి బాసటగా నిలుస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి
- కాంట్రాక్టు ఉద్యోగిని కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందిస్తున్న శశిధర్

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కోసం పోరాడుతున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ఉద్యమానికి బాసటగా నిలుస్తానని సమస్య పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఖమ్మం,నల్గొండ,వరంగల్ జిల్లాల టీఎస్ సీపీఎస్ ఈయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొలిపాక వెంకటస్వామి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని దీక్షలరే సంఘీభావం తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

తిరుమలాయపాలెం మండలం మండల వనరుల కేంద్రంలో క్లర్క్ కం కంప్యూటర్ ఆపరేటర్ (సీసీవో)గా విధి నిర్వహణలో ఉన్న పి.హైమావతి గుండెపోటుతో చనిపోవటం తెలిసిందే.. విషయం తెలుసుకున్న వెంకటస్వామి బాధిత కుటుంబానికి రూ.పదివేల రూపాయలు టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా శాఖ ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు.

వాహనాల బ్యాటరీల చోరీ

- కేఎంసీలో 120వాహనాలకు రక్షణ కరువు
- పట్టించుకొని అధికారులు



బ్యాటరీ చోరీకి గురైన వాహనం

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): దొంగలు బాబోయ్ దొంగలు అంటూ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని వాహనాల డ్రైవర్లు గగ్గోలు పెడుతున్నారు. ఉదయం విధులకు హాజరై వాహనం చూసుకునే వారకు ప్రశాంతంగా ఉండలేని దుస్థితి కేఎంసీలో ఏర్పడింది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వాహణకు 60ట్రాక్టర్లు మరో 60 స్వచ్ఛ భారత్ ఆటోలు పనిచేస్తున్నాయి. వాటిని సురక్షతంగా ఉంచేందుకు కేఎంసీ కార్యాలయం వెనుక పార్కింగ్ స్థలం కేటాయించారు. భద్రత కోసం ఓ వృద్ధుడికి విధులు కేటాయించారు. పార్కింగ్ ప్రాంతంలోని ప్రధాన రహదారికి కనీసం గేటు కూడా లేదు. ఉన్న ఒక్క సీసీ కెమెరా సక్రమంగా పని చేయదు. 120 వాహనాలను తన నిఘా నేత్రంతో పరిశీలించలేదు. ఇదేఆదునుగా దొంగల తమ సత్తాను చాటుతున్నారు. పారిశుధ్య వాహనాలకు ఉన్న బ్యాటరీలు, టూల్ కిట్లు, ఇతర సామాన్లు తస్కరిస్తున్నారు. ఈనెల 19న ఒకేరోజు మూడు వాహనాలు సామాన్లు మాయం కావటం కేఎంసీలో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం కమిషనర్ వరకు వెళ్లింది.

అమిత్‌షా మాటల్లో మతోన్మాద కుట్ర

ఖమ్మంటౌన్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి మాటల వెనకు మతోన్మాద కుట్ర దాగి ఉన్నదని, అంబేద్కర్‌ను అందుకే అవమానించారని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై శనివారం బైపాస్‌రోడ్‌లో కేంద్ర హోంమంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే. జానీ మియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గసభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'స్మార్ట్‌కిడ్జ్'లో వెల్లివిరిసిన సృజనాత్మకత



ఎగ్జిబిట్స్ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఇన్‌స్పైర్ 2024... చిన్నారుల మేధస్సును చాటి చెప్పింది. సృజనాత్మకతతో అణువు నుంచి అంతరిక్షం దాకా 200 పైగా ఎగ్జిబిట్స్ ఇమ్మెర్లో ప్రదర్శించారు. ఎల్కేజీ, యూకేజీ చిన్నారుల నుండి మొదలుకొని ఐదో తరగతి విద్యార్థుల వరకు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్యఅధ్యక్షతన ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో కళావతిబాయి, హాజరయ్యారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికితీయడానికి ఈఎక్స్ పోలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మోతరపు శ్రావణి సుధాకర్, పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య పాల్గొన్నారు.

మిలీనియంలో ఆకట్టుకున్న విజ్ఞాన సదస్సు



ఎగ్జిబిట్స్ పరిశీలిస్తున్న డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మిలీనియం పాఠశాలలో శనివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞాన సదస్సు ఆకట్టుకుంది. 500పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు.ఎల్కేజీ,యూకేజీ చిన్నారుల నుంచి మొదలుకొని తొమ్మిదో తరగతి విద్యార్థుల వరకు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో సోమశేఖరశర్మ, ఖమ్మం అర్బన్ మండల ఎంఈవో శైలజ లక్ష్మి హాజరయ్యారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికితీయడానికి ఈఎక్స్ పోలు దోహదపడతాయన్నారు.ఈకార్యక్రమంలో జోనల్ ఎడ్యుకేషన్ సొసైటి ప్రెసిడెంట్ బషీర్ అలీ, కరస్పాండెంట్ మహమ్మద్ జాహెద్‌అలీ, ప్రిన్సిపల్ తబసుమ్ పాల్గొన్నారు.

విన్‌ఫీల్డ్‌కు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్లు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలకు ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డుకు ఎంపికైంది. ఏషియా టుడే ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో శనివారం హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. జాతీయ స్థాయిలో మొత్తం 143 ఎంట్రీలు రాగా వాటిలో 30ఎంట్రీలను ప్రైడ్ ఆఫ్ నేషన్ ఎంపిక చేసింది. వివిధ రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి వాటిలో ది బెస్ట్ స్కూల్ విత్ అకడమిక్ ఎక్సలెన్స్ ఇన్ తెలంగాణ అవార్డును విన్‌ఫీల్డ్ పాఠశాలకు అందించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్, పోలవరపు శ్రీకాంత్ అవార్డును అందుకున్నారు.

పారిశుధ్య కార్మికులతో నిర్మాణ వ్యర్థాల తొలగింపు

విధులు కేటాయించిన జవాన్



నిర్మాణ వ్యర్థాలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఖమ్మం నగర పాలక సంస్థలో ప్రత్యేకంగా పారిశుధ్య విభాగం ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగిస్తున్నారు. అయితే కేఎంసీలో కొంతమంది జవాన్లు ప్రైవేట్ కాంట్రాక్టర్లుకు మెహర్బానిగా వ్యవహరిస్తున్నారని బహిరంగ విమర్శలు వెలువడుతున్నాయి. ఖమ్మం నగరంలోని 50వ డివిజన్‌లో ఇటీవల డ్రెయినేజీ నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్ చేపట్టారు. వ్యర్థాలను మాత్రం తొలగించకుండా రహదారిపై వదిలేశారు. సదరు కాంట్రాక్టర్‌తో వ్యర్థాలను తొలగించాల్సి ఉండగా శుక్రవారం ఐదుగురు పారిశుధ్య పురుష కార్మికులకు విధులు కేటాయించారు. నిర్మాణ వ్యర్థాలను తొలగించే విధులను స్థానిక జవాన్ కేటాయించారు.

సమస్యలపై పోరాటాలకు మహాసభలో 15 తీర్మానాలు

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మంటౌన్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఈనెల 18,19 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం అయ్యాయని, వివిధ సమస్యలపై పోరాటాలకు ఈమహాసభలో 15 తీర్మానాలు ఆమోదించామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం జిల్లా సీపీఎం కార్యలయం సుందరయ్యభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈవివరాలు వెల్లడించారు. మహాసభలకు మొత్తం 525మంది ప్రతినిధులు హాజరయ్యారని, జిల్లాలోని పలు సమస్యలపై మహాసభల్లో చర్చించామన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై త్వరలో నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్,జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, కళ్యాణం వేంకటేశ్వరరావు, వై. విక్రమ్, మాదినేని రమేష్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు
- నగరంలో భారీ ర్యాలీ

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలంటూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం భక్త రామదాసు కళాక్షేత్రం నుంచి జడ్పీ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించిన సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. టీకప్పులు చేతుల పట్టుకొని నినాదాలు ఇస్తూ మానవహారం నిర్వహించారు. తక్షణమే రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ ర్యాలీలో పాల్గొన్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాస్వామి, అడిషనల్ జనరల్ సెక్రటరీ అనిల్, ఉపాధ్యక్షుడు సాంబశివరావు, ఇస్మాయిల్,వర్కింగ్‌ప్రెసిడెంట్ విజయనిర్మల,జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, కోశాధికారి రాణి, కార్యదర్శులు కృష్ణ ప్రసాద్, సురేష్, భగవాన్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న హరిశ్రీనివాస్

నేలకొండపల్లి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి):రోటరీ క్లబ్, ఖమ్మం వారి ఆధ్వర్యంలో పేదలకు, దివ్యాంగులకు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యదర్శి హరిశ్రీనివాస్ చెప్పారు. శనివారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రవ విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి చదువుకోవటానికి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నిరుపేద విద్యార్థినులకు వీటిని అందచేస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులకు క్లబ్ తరపున ట్రైసైకిళ్లను సైతం అందచేస్తున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్ సేవలను విస్తృతపరుస్తామని,భవిష్యత్తులో మరిన్ని సేవలను అందిస్తామని శ్రీనివాస్ చెప్పారు. విద్యాభివృద్ధికి క్లబ్ ఎన్నో సేవలు అందిస్తోందని చెప్పారు.

రాజేశ్వరపురంలో పోషకాహార దినోత్సవం



నేలకొండపల్లి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజేశ్వరపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం పోషకాహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోషకాహార దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లల తల్లిదండ్రులు పోషకాహార విలువలతో కూడిన ఆహారాన్ని తయారు చేసి విద్యార్థులతో పాఠశాలకు పంపారు. విద్యార్థులు తెచ్చిన పోషకాహారాన్ని ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రదర్శన చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు పోషక ఆహారం ఎంతో అవసరమన్నారు. పిల్లలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని లేని పక్షంలో వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖమ్మం ఖానాపురంహవేలి: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలో శనివారం నిర్వహించిన తెలంగాణ ఆహారోత్సవం విజయవంతమైంది. నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం (పిటీఎం)కు జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ యలగందుల రాజశేఖర్ పౌష్టికాహారం వారి శారీరక, మానసిక పెరుగుదలకు తోడ్పాడుతుందని వివరించారు. పాఠశాల హెచ్ ఎం మంజుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, స్నేహ, శాంతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయండి

నేలకొండపల్లి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 28, 29, 30 తేదీల్లో నల్గొండలో జరుగనున్న యూటీఎఫ్ ఆరవ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి చలపతి రావు ఉపాధ్యాయులను కోరారు. శనివారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను ఎంఈఓ ఆవిష్కరించారు.కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మందడపు శ్రీనివాసరావు, తొర్తి గురవయ్య, ప్రధానోపాధ్యాయులు రమేష్, వెంకటయ్య, ఉపాధ్యాయులు రాంబాబు, వేణు, సత్యనారాయణ, ప్రతిమ, గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇర్రి హేమలతకు ఘననివాళులు



తిరుమలాయపాలెం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిరిపురానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఇర్రిర హేమలతకు వివిధపార్టీల నేతలు నివాళులర్పించారు. ఇటీవల ఆమె గుండెపోటుతో మృతి చెందగా శనివారం దశదినకార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో చర్చిపాస్టర్ల ఎంసీ మార్కు, పరిమళరావు, కనకరదాస్ జాన్‌వెస్లీ, ఇర్రి కళ్యాణ్‌కుమార్, జోస్న, దీప, మాజీసర్పంచ్ అఖిలప్రేమ్‌సాగర్,ప్రసాద్, జమ్మిజయపాల్,సుందర్‌రావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు!

- ఏళ్లతరబడి లబ్ధి కోల్పోతున్న పేదలు
- ఉన్న రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగింపు
- ఆరోగ్యశ్రీ సేవల కోసం అగచాట్లు
- పాత రేషన్‌కార్డుల్లో పేర్లను పునరుద్ధరించాలని వేడుకోలు



తల్లాడ, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్(ఆహారభద్రత) కార్డుల జారీలో జాప్యం వల్ల దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారింది. గతంలో తల్లిదండ్రులతో కలిసి ఉమ్మడిగా ఉన్న రేషన్‌కార్డుల్లోని తమ పేర్లను పెళ్లి అయిన దంపతులు తొలగించుకొని కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. నాలుగైదు సంవత్సరాల క్రితం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ కొత్త రేషన్‌కార్డుల జారీకి మోక్షం లభించలేదు. దీంతో ఒకవైపు నాలుగైదు సంవత్సరాలుగా ఉమ్మడి కుటుంబ రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగించుకున్న కొత్త దంపతులు, మరోవైపు కొత్త రేషన్‌కార్డులు రాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రయోజనాలను పొందలేక పేద కుటుంబాలు నష్టపోతున్నాయి. రేషన్‌కార్డుల్లో పేరు నమోదై ఉన్న ఒక్కొక్క కుటుంబసభ్యుడికి ప్రతి నెలా ఉచితంగా ఆరుకిలోల చొప్పున బియ్యం అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యసేవలతోపాటు ఉచిత ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రభుత్వం రేషన్‌కార్డులను ప్రామాణికంగా పరిగణిస్తుంది. తల్లిదండ్రులకు చెందిన ఉమ్మడి రేషన్‌కార్డుల్లో నమోదైన పేర్లను పెళ్లి అయిన తర్వాత తొలగించుకోవడం కొత్తగా రేషన్‌కార్డులు రాని కారణంగా ఏళ్ల తరబడి కొత్తగా ఏర్పాటైన పేద కుటుంబాలు ప్రతినెలా ఉచిత బియ్యం, ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిని కోల్పోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన పెళ్లైన దంపతులకు కొత్త రేషన్‌కార్డులు జారీచేయాలని కోరుతున్నారు. కొత్త రేషన్‌కార్డులు వచ్చేవరకు గతంలో తల్లిదండ్రుల ఉమ్మడి రేషన్‌కార్డుల్లో ఉన్న తమ పేర్లను తిరిగి పునరుద్ధరించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని పేదలు వేడుకుంటున్నారు.

నాలుగేళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం

● గద్దల గోపాలరావు, మల్లవరం



2017వ సంవత్సరంలో మాకు వివాహమైంది. ఒక కుమార్తె పుట్టింది. తల్లిదండ్రుల ఉమ్మడి కుటుంబ రేషన్ కార్డులో నమోదై ఉన్న నేను, నా భార్య పేర్లు తొలగించుకొని 2019వ సంవత్సరంలో ప్రత్యేకంగా కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటివరకు రాలేదు. ఇటీవల స్పృహ తప్పి పడిపోవడంతో నా ఎడమచేయి విరిగిపోయింది. ఉమ్మడి రేషన్‌కార్డులో పేరు తొలగించుకోవడం, కొత్త రేషన్ కార్డు రాకపోవడం వల్ల ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు పొందలేకపోయాను. రేషన్‌కార్డులు మంజూరు చేసి పేదలను ఆదుకోవాలి.

రూ.వందకోట్ల పనుల జాబితా సీఎంకు అందజేసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డికి నివేదికను అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ రూ.వందకోట్లతో ప్రతిపాదించిన పనుల జాబితాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అందజేశారు. శనివారం అసెంబ్లీ కార్యాలయంలోని ముఖ్యమంత్రి ఛేషీలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఏడాది ఆగస్టు 15న వైరాలో జరిగిన రైతు సభలో పాల్గొన్న ముఖ్యమంత్రికి తాను అందజేసిన వినతి మేరకు వైరా మునిసిపాలిటీలో రూ.వందకోట్ల అభివృద్ధి పనులకుగానూ ప్రతిపాదనలు పంపించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలను ఎమ్మెల్యే ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం పేషీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రూ.వందకోట్లకు తాము ప్రతిపాదించిన పనుల జాబితా వివరాలను ముఖ్యమంత్రికి అందజేసి వెంటనే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రూ.వందకోట్ల పనుల మంజూరుకు ప్రతిపాదించాలని ఆదేశాలు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయండి

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీజ



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ శ్రీజ

సత్తుపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో నూతనంగా నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా జాయిం ట్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. శనివారం ఆమె ఆకస్మికంగా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. నూతనంగా నిర్మాణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేయాల్సిన పనులు (పరికరాలు) ఎన్ని, ఇంకా ఎన్ని రావాల్సి ఉందని సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజుల క్రితమే విద్యుత్ కనెక్షన్ ఇవ్వగా ఆపరేషన్ థియేటర్లలో అన్ని పరికరాలను 10రోజుల్లోనే బిగించాలని సూచించారు. కాగా కొత్త ఆసుపత్రిలో సుమారు 60మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 13మంది విధులలో ఉన్నారని, పూర్తిస్థాయిలో సేవలు అందించాలంటే పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది ఏర్పాటు చేయాల్సి ఉందని సూపరింటెండెంట్ తెలిపారు.

సత్తుపల్లిలో 76శాతం
ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 23వార్డులలో 76 శాతం ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి అయ్యిందని మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలు తీర్మానాలు చేయగా పాలకవర్గం అంగీకరించింది. కార్యక్రమంలో పాలకవర్గంతో పాటు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

ముదిగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం న్యూలక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనం, స్టోర్ రూమ్‌లను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు బోధిస్తున్న అంశాలపై ఆరా తీశారు. అనంతరం సమగ్ర శిక్షా సమ్మెలో కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నందున విద్యార్థులు తరగతులు మిస్ కాకుండా మండల విద్యాశాఖ రమణయ్య, జడ్పీఉన్నత పాఠశాల హెచ్ఎం మైత్రీ, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- డీపీవో ఆశాలత



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

బోనకల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని డీపీవో ఆశాలత ఆదేశించారు. మండలంలోని రావినూతల, పెద్ద బీరవల్లి గ్రామాలల్లో నిర్వహిస్తున్న ఇళ్ల సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుల ఆధారంగా వాస్తవిక వివరాలను నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వెంకట సుబ్రమణ్యశాస్త్రీ, తదితరులు ఉన్నారు.

చింతకానిలో ....

చింతకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టాలని డీపీవో ఆశాలత అన్నారు. శనివారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో సర్వే తీరును శనివారం ఆమె పరిశీలించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో ఫిరోజ్ కౌసర్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

న్యాయవాదులకు అవగాహన

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్యాలు, మెళకువలపై జూనియర్ న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ మెంబర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది పీ.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సత్తుపల్లి కోర్టులో శనివారం నిర్వహించిన సమావేశంలో న్యాయవాదుల విధులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్లూరి ఆడమ్స్, న్యాయవాదులు గొర్ల రామచంద్రారెడ్డి, జానకీ రామారావు, షేక్.బుజ్జీసాహెబ్, కంచర్ల వెంకటేశ్వరరావు, శిరీష, సోమిశెట్టి శ్రీధర్, అరుణ, రమేష్, రామకృష్ణ, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మందుల వివరాలను ఉంచుతున్నాం

- సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో మందులు, శస్త్రచికిత్సల స్టాక్ వివరాలను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. అన్ని రకాల మందులు, శస్త్ర చికిత్సలకు సంబంధించిన వివరాలు జాబితాలో పేర్కొంటున్నట్లు తెలిపారు. కాగా ఫోన్ నెంబర్లతో పాటు రోగులకు అందుబాటులో ఉండే వారిపేరును సైతం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యూటీఎఫ్ సభలను విజయవంతం చేయాలి

బోనకల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ కోరారు. శనివారం మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎంఈవో దామాల పుల్లయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సదాబాబు, సౌభాగ్యలక్ష్మి, నర్సింహారావు, సత్యానారాయణ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

హమాలీల
సమస్యలు పరిష్కరించాలి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హమాలీ కూలీల కుటుంబాలలో వెలుగులు నింపాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం మాని విస్మరిస్తుందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న సీజనల్ హమాలీ కూలీలతో సత్తుపల్లిలో సమావేశమయ్యారు. సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని, ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని కోరారు.

ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన



పిల్లలకు పదార్థాలను వడ్డిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆహారపు అలవాట్లపై అవగాహన ఉండాలని ఎన్టీఆర్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుధాకరరెడ్డి అన్నారు. తెలంగాణ ఆహారోత్సవంలో భాగంగా శనివారం పాఠశాలలో ఆహార పదార్థాలతో తయారుచేసిన 100కు పైగా వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మి, ఉపాధ్యాయులు లాల్ అహ్మద్, శేషకుమార్, నర్సింహారావు, వెంకటేష్, విజయ పాల్గొన్నారు.

మధిర రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంటివద్ద పౌష్టికాహారం అందిస్తూ తల్లిదండ్రులు చక్కగా చదివించాలని హెచ్ఎం సంగారావు తెలిపారు. శనివారం మధిర మండలం నాగవరప్పాడు యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుడ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అందుబాటులో ఉన్న పదార్థాలతో పోషక విలువలతో కూడిన వంటకాన్ని తయారుచేసుకొని తీసుకువచ్చి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.కృష్ణయ్య, రవికుమార్, లింగయ్య పాల్గొన్నారు.

సూపర్‌శాలరీ ఖాతాదారులకు ఇన్సూరెన్స్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు యూనియన్ బ్యాంక్‌లో సూపర్ శాలరీ ఖాతాను కలిగి ఉంటే ప్రమాదబీమాగా రూ.కోటి ఇన్సూరెన్స్ వర్తిస్తుందని బీఎం ఏ.సురేష్ తెలిపారు. శనివారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం యూ.రాజ్యలక్ష్మి, బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ సాయిప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయం

వైరా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా పర్పుల్ డీఎస్‌ఏ సొసైటీ కృషి చేస్తుందని ఉపాధ్యక్షుడు చౌడవరపు బద్రీనారాయణ, కార్యదర్శి కవితారాణి అన్నారు. శనివారం స్థానిక గుట్టబడి పాఠశాలలో విద్యార్థులకు బైబెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు, డాక్టర్ నాగసుధారాణి సహకారంతో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు మిట్టపల్లి భాస్కర్‌రావు, పెనుగొండ ఉపేంద్రరావు, అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ దుర్గాభవాని, ప్రధానోపాధ్యాయుడు రామడుగు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని గంగారం, ప్రకాష్‌నగర్, రామగోవిందపురం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్ఆర్ అభిమాన సంఘం నాయకులు శ్రీరామ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అల్లు గణపతిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు అల్పాహారంగా పంపిణీ చేశామన్నారు.

ఎస్ఎఫ్ఐ
మండల కమిటీ ఎన్నిక

పెనుబల్లి, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ పెనుబల్లి మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తేళ్లూరి భాను, పండూరి స్వామిని ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు తెలిపారు. ఈ సందర్భంగా సాయిశేషు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల కోసం పోరాడే ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ నాయకురాలు మల్లూరి సత్య, తల్లాడ మండల కార్యదర్శి బొల్లం కార్తీక్, ప్రశాంత్, శివ, కిరణ్ పాల్గొన్నారు.

అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలి



కారేపల్లిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వైరా/కారేపల్లి/మధిరటౌన్/సత్తుపల్లి రూరల్/ కొణిజర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ఆయా మండలాల్లో, పట్టణాలలో పలు పార్టీల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అమిత్‌షాను దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్‌షా వెంటనే దేశప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సత్తుపల్లిలో నేడు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మధిరటౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిపార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిడమానూరి వంశీ, దుంపా వెంకటేశ్వరరెడ్డి, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ తలుపుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారత్నం ట్రస్టు సేవలు అభినందనీయం

తల్లాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధికి పరిశ సీతారత్నం ఛారిట్రబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈవో ఎన్.దామోదర్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని అన్నారుగూడెం ఉన్నత పాఠశాలలో శనివారం ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలకు కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి మహంకాళి సరోజిని, ఉపాధ్యాయులు గిరిజారాణి, శారదాదేవి, సనత్‌కుమార్, రామారావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి పింగలి సామేలు రాజీనామా

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర పొలిటికల్ వింగ్ అధ్యక్ష పదవికి పింగలి సామేలు శనివారం రాజీనామా చేసినట్లు ఆసంఘ జాతీయ అధ్యక్షుడు అలవాల కరుణాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకాలం తనకు సహకరించిన వారందరికీ సామేలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈరోజు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు సత్తుపల్లి ఐడీడీఎస్ 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శరత్ బాబు శనివారం ఒక ప్రటకనలో తెలిపారు. మసీద్ రోడ్, సురేష్ సైకిల్ షాప్ రోడ్, కాకర్లపల్లి రోడ్, శివసాయి నగర్, వాయిపుత్ర నగర్, హనుమాన్ నగర్‌లలో సప్లయి నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యప్ప పడిపూజ

బోనకల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో శనివారం అయ్యప్ప పడిపూజా కార్యక్రమాన్ని గురుస్వాములు రావుట్ల సత్యనారాయణ, మెట్టేల నాగరాజుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, కలశ పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న వరలక్ష్మి

ఏన్కూరు, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిగుడిసె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు శనివారం ఎంపీడీవో రమేష్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువు లో రాణించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. ఈక్యార్రమంలో టీడీపీ జిల్లా నాయకుడు ఆరెం రామయ్య, ఉపాధ్యాయులు బానోతు రాంబాబు, దుగ్గిరాల రాంబాబు, ఎంపీవో జీవీఎస్ నారాయణ పాల్గొన్నారు

నాగులవంచలో యోగా దినోత్సవం

చింతకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యోగా ప్రాముఖ్యత, యోగా వలన కలుగు ప్రయోజనాల గురించి పాఠశాల కరస్పాండెంట్ బోడెపూడి కిరణ్ విద్యార్థులకు వివరించారు. ధ్యానం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక జీవన వారసత్వం అన్నారు. ధ్యానం వలన విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే యోగ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు బోల్లా రేణుక, శ్రీనివాస్, గోపిచంద్, ప్రశాంతి, పార్వతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు



వైరాలో న్యూలిటిల్‌ఫ్లవర్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సెమీ క్రిస్మస్ వేడుకలు

కారేపల్లి, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్వాన్ హైస్కూల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ పాల్‌రాజ్, హైస్కూల్ ప్రిన్సిపాల్ జేమ్స్‌చాకో మాట్లాడుతూ క్రిస్మస్ గొప్పతనాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో జోశిబా, గిఫ్టి, వినోద్, అనూప్, రోజా, రేణుక, సుభద్ర, స్వరూప పాల్గొన్నారు.

తల్లాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలభారతి విద్యాలయంలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లూర్దుమాత విచారణ గురువు పాదర్ మరియన్న, కోటగిరి ప్రవీణ్, తాళ్లూరి రామారావు, యాచమనేని శశాంక్ పాల్గొన్నారు.

వైరా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ స్కూల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



పాఠశాలలో ముగ్గులు వేస్తున్న బాలికలు

శ్రీనివాస్‌రామానుజన్ జయంతి

కొణిజర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస్‌రామానుజన్ 127వ జయంతిని మండలంలోని కొణిజర్ల, సింగరాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరాయపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.